TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 273 | శనివారం 26-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-



## గంగమ్మ ఒడికి గౌరీ తనయుడు..

## భక్తజనసందోహం నడుమ నిమజ్జనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఖైరతాబాద్ బడా గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తిచేశారు.

## బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర

# రూ.39 లక్షల



హైదరాబాద్: నగరంలోని బాలాపూర్‌లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్‌రెడ్డి సొంతమైంది. రూ.39లక్షలకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది. వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కి ప్రత్యేక స్థానం ఉంది. స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపు సాధించింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందుకే వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.

**రూ.450 నుంచి నుంచి రూ.39 లక్షల వరకు..**

బాలాపూర్ వినాయకుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. లంబోదరుడిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలం నిర్వహించింది. మొదటిసారిగా లడ్డూ ప్రసాదాన్ని రూ.450కు కైవసం చేసుకున్న రైతు కొలను మోహన్‌రెడ్డి.. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచి.. మిగతాది పొలాల్లో చల్లారు. 2లో



## ‘బ్రహ్మోస్’తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

- బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులంటూ అమిత్ షా
- ఏకే-203 రైఫిళ్లతో మావోయిస్టులు, ఉగ్రవాదులకు భయం
- ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ దాడులను గుర్తుచేసిన షా
- యూపీలో రక్షణ, వాహన రంగాల పురోగతి
- భారత్ స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందని వ్యాఖ్య
- పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడి
- ‘వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్’ విధానంపై ప్రశంసలు

2లో

## సీఎం రేవంత్‌కు ఆర్యదాన్ మొహమ్మద్

# బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు

### రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు ఏకం కావాలి



- మతతత్వ శక్తులను అడ్డుకోవాలని రేవంత్ పిలుపు
- నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు
- మోదీపై ఓటు, పార్టీ, నిధుల చోరీ ఆరోపణలు
- యువత భవిష్యత్తును చోరీ చేస్తున్నారని విమర్శ
- రాజ్యాంగ వ్యతిరేక శక్తులను గద్దె దించాలని పిలుపు

రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు అందరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేరళంలో ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా.. నిలంబూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును రేవంత్‌రెడ్డి అందుకున్నారు. అనంతరం మాట్లాడిన సీఎం.. దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు ఇచ్చే నివాళి అని తెలిపారు. కేరళంలో కాంగ్రెస్ సర్కార్ ఉన్న ప్రతిసారి.. కేంద్రంలోనూ అధికారంలో ఉండేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓటు చోరీ, పార్టీ చోరీ, నిధుల చోరీ సహా.. దేశ యువత భవిష్యత్తును సైతం చోరీ చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని అడ్డుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను గద్దె దించాలని

## వ్యవసాయ రంగంలో సీఎస్ఆర్ సహకారానికి పరిశ్రమలతో ఐకార్ భాగస్వామ్యాలను సులభతరం చేసిన అగ్రిఇన్నోవేట్ ఇండియా



2లో

న్యూఢిల్లీలో అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం, 71వ బోర్డు సమావేశం

## సమర్థవంతమైన అటవీ నిర్వహణకు సామర్థ్య పెంపు ప్రాజెక్టు వర్క్‌షాప్ ప్రారంభం




**ప్రాంతాలవారీ అవసరాలు, స్థానిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) సహకారంతో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ‘సమర్థవంతమైన అటవీ నిర్వహణ కోసం సామర్థ్య పెంపు ప్రాజెక్టు’ వర్క్‌షాప్‌ను కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ శుక్రవారం న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్‌లో మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, జైకా ఇండియా సీనియర్ ప్రతినిధి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అటవీ శాఖల ప్రతినిధులు, భారతీయ పరిశోధనా సంస్థలు, అటవీ రంగంలోని కేంద్ర శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 2లో

## నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా

# పూర్తి చేయాలి

హైదరాబాద్: గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు.

**గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ బడా గణేశుడు**

హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.





## ఆరు దేశాల రాయబారుల నుంచి ఆధారపత్రాలు స్వీకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



2లో

## 23 రోజుల్లో 6 వేల మీటర్లకు పైబడిన 20 పర్వత శిఖరాల అధిరోహణ

**చరిత్ర సృష్టించిన నిమాస్ పర్వతారోహక బృందం యాత్రను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**




2లో

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
26-09-2026

# సంపాదకీయం

## మానవుడిక మహనీయుడూ మాననీయుడు కాదా?

ప్రకృతిని జయించటం, అనుభవించటం అన్నవి మనిషి ఆలోచనలను 250 ఏళ్లపాటు తీవ్రంగా ప్రభావితం చేశాయి. చరాచర ప్రపంచంతో పాటు సమస్త జంతు, వృక్ష సంపద మనుషుల అవసరాలు, ఆనందాల కోసమే ఉందన్నట్లుగా పరిగణించటం పారిశ్రామిక విప్లవం తర్వాత కనీవినీ ఎరగని రీతిలో ఊపందుకుంది. హద్దులూ, అవధులూ లేకుండా మనిషి జైత్రయాత్ర ప్రకృతిపై సాగుతూనే ఉంటుందని ఎందరో శాస్త్రవేత్తలూ తత్వవేత్తలూ ప్రగతి గానాలు చేశారు. మరెందరో కవులూ, కళాకారులూ వాటితో గొంతు కలిపారు. 'మానవుడే మహనీయుడు.. శక్తియుతుడు.. యుక్తిపరుడు.. మానవుడే మాననీయుడు.. జీవకోటి సర్వములో శ్రేష్ఠతముడు.. మానవుడే మహనీయుడు.. మహనీయుడు..' అంటూ ప్రముఖ కవి ఆరుద్ర 1972లో బాలభారతం సినిమాలో రాసిన పాట దీన్నే గుర్తుచేస్తుంది. 'గ్రహరాశులనధిగమించి.. ఘనతారల పథం నుంచి.. గగనాంతర రోదసిలో.. గంధర్వగోళతతుల దాటి.. బొందితో భువికి తిరిగి రాగలిగే' ఘనశక్తి మనిషికే ఉందని గొప్పగానూ శ్లాఘించారు. 'మెదడన్నది మనకున్నది.. అదిసరిగా పనిచేస్తే.. విశ్వరహః పేటికా విపాటన జరగక తప్పదు' అని శ్రీశ్రీ మానవమేధ ఔన్నత్యానికీ, ఆధిక్యానికీ అక్షరరూపమిచ్చారు. సృష్టికి ప్రతిసృష్టి చేసే శక్తి మనిషి మెదడుకు ఉండటమే అద్భుతమని అనుకున్న దశ నుంచీ ఆ ప్రతిసృష్టిని చూసి భయపడే స్థితికి మనం చేరుకోవటం ఇప్పుడు సవాల్‌గా పరిణమించింది. కృత్రిమమేధ (ఏఐ)తో మనిషి తన ఆధిపత్యానికి తనే మరణశాసనం రాసుకుంటున్నట్లుగా భావించే విపరీత వ్యాఖ్యానాలతో పాటు ఆర్థికరంగంలో అది చూపించే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆ సవాల్‌ను అంత తేలికగా తీసుకోలేం.

ఇప్పటివరకూ మనం శాస్త్రసాంకేతిక రంగంలో ఎన్నో విప్లవాలను చూశాం. అవన్నీ మనుషుల సౌకర్యాలను, సంతోషాలను గణనీయంగా పెంచి అంతేస్థాయిలో పర్యావరణాన్ని దెబ్బతీశాయి. అందుకే 1970ల నుంచి పర్యావరణ చైతన్యం క్రమేపీ బలపడి అభివృద్ధి పేరుతో, ప్రకృతిని జయించటం పేరుతో దేన్నైనా చేయొచ్చనే ధోరణికి బంధనాలు వేయటానికి ఎన్నో విధానాలు రూపొందాయి. మనుషులు భద్రంగా బతకటానికి అవసరమైన పర్యావరణం ఉండాలంటే పారిశ్రామిక యుగం కంటే ముందున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ మించకుండా చూడాలని ప్యారిస్ వాతావరణ ఒప్పందం తీర్మానించటానికి కూడా ఈ నేపథ్యమే కారణం. గతంలోని శాస్త్ర సాంకేతిక విప్లవాలు ఏవీ మనుషుల నియంత్రణను దాటిపోయే ప్రమాదాన్ని తీసుకురాలేదు. అపరిమిత లాభాల కోసమూ, కంపెనీలు, దేశాల మధ్య ఆధిపత్యం కోసమూ శాస్త్రసాంకేతిక రంగాలను దుర్వినియోగం చేసి యుద్ధాలనూ పర్యావరణ విధ్వంసాలనూ కొనితెచ్చినా, అవసరమనుకున్నప్పుడు ఆ రంగాలను అదుపులో పెట్టగలిగే పరిస్థితి ఎంతో కొంత ఉండేది. ఏఐని అలా అదుపులో ఉంచే పరిస్థితి ఉండదనీ మనిషి అదుపాజ్ఞలను అది తోసిపుచ్చి, స్వయం నిర్ణయాలను తీసుకునే తీవ్ర ప్రమాదాన్ని కొట్టిపారేయలేమనే వ్యాఖ్యానాలు బలంగా వినపడుతున్నాయి. ఏఐ రంగంలో అగ్రగాములుగా ఉన్న నిపుణులు, కంపెనీల అధినేతల నుంచే ఇలాంటి భయాలు వెల్లడికావటంతో అంతర్జాతీయస్థాయిలో ఏఐపై నియంత్రణ ఉండాలనే భావన బలం పుంజుకుంటోంది. మానవ అస్తిత్వానికీ, మనిషి సహజశక్తులకూ భంగం కలగని రీతిలో ఏఐని కట్టడిచేయటానికి ప్రయత్నాలు జరగకపోతే కలిగే అనర్థాలు చాలా ఉంటాయి. ఇప్పటికే ఏఐ పేరుతో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. అగ్రశ్రేణి కంపెనీలే వరసపెట్టి లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం 40శాతం ఉద్యోగాలు (మరో అంచనా ప్రకారం అది 60శాతం వరకూ ఉండొచ్చు) ఏఐతో ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. డేటా ఎంట్రీ, కస్టమర్ సర్వీస్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, లా, అకౌంటింగ్, మెడిసిన్, టీచింగ్, జర్నలిజం, గ్రాఫిక్ డిజైనింగ్-- కంటెంట్ క్రియేషన్, ట్రాన్స్‌లేషన్ లాంటి రంగాల్లో ఉద్యోగాల కోతలు తీవ్రంగా ఉంటాయి. టీచింగ్, జర్నలిజం లాంటి రెండు రంగాలను ఉదాహరణగా తీసుకుంటే ఏఐ ప్రభావం ఎలా ఉంటుందో తేలికగానే ఊహించొచ్చు. ఒక్క ఏఐ ట్యూటర్ వేలమంది టీచర్లు చేసే పనిని అతి తేలికగా చేయగలదు. విద్యార్థుల స్థాయినీ, వారు చేసే తప్పులనూ, వారు లేవనెత్తే ప్రశ్నలనూ నిమిషాల్లో గుర్తించగలదు. ప్రతి విద్యార్థికి సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాన్ని స్పష్టం చేయగలదు. ఇక జర్నలిజానికి అవసరమైన అనేక విషయాలను సంగ్రహపరచి పాఠకులకు అర్థమయ్యేరీతిలో కథనాలను తేలికగా తయారు చేస్తుంది. క్రీడా విశేషాలూ, ఫైనాన్షియల్ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థకూ సంబంధించిన న్యూస్‌నూ, వీడియోలను అనుసరించి కావాల్సిన భాషల్లో లిఖిత రూపంలో ఇవ్వటమూ, అనువాదాన్ని అందించటమూ, వివిధ పరిణామాలనూ సంక్షిప్త-- దీర్ఘవార్తలుగా తీర్చిదిద్దటమూ, గణాంకాలనూ-- డేటానూ అవసరాలకు తగ్గట్టుగా విశ్లేషించి-- వర్గీకరించటమూ నిమిషాల్లో చేయగలగటంతో జర్నలిజంలో మానవవనరుల వినియోగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

ఉద్యోగాలను దెబ్బతీయటం ఏఐ ఏ స్థాయిలో చేయగలదో ఇంకా పూర్తిగా స్పష్టం కావటం లేదు. గతంలోనూ కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చినప్పుడు దాని ప్రభావాన్ని అంచనా వేయటానికి చాలాకాలమే పట్టింది. క్యాపిటలిజంగా మనం పిలిచే ఆర్థిక వ్యవస్థలో మార్పులు అనూహ్యంగా వస్తాయి. మలుపులు కూడా అనూహ్యంగా ఉంటాయి. దాని సాధారణ స్వరూపమూ, నడవడిక గురించి అవగాహన ఉన్నా నిర్దిష్టంగా జరిగే మార్పులు ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఒకటి మాత్రం స్పష్టం. క్యాపిటలిజాన్ని దాని మానాన దాన్ని వదలివేస్తే విపరీత పర్యావరణ విధ్వంసానికీ, గుత్తాధిపత్యానికీ దారితీస్తుంది. ఏఐ కూడా ఇప్పుడు అదే బాటలో నడుస్తోంది. ఏఐకి ఎంతో కీలకమైన డేటా సెంటర్లు పర్యావరణంపై కలగచేసే ప్రతికూల వాతావరణం గురించి ఇప్పటికే పెద్ద చర్చ మొదలైంది. అమెరికాలోనే వాటిపై వ్యతిరేకత ఆరంభమైంది. కొన్నిచోట్ల స్థానిక ప్రభుత్వాలు వాటి ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఇది కనపడుతోంది. ఇక ఏఐతో గుత్తాధిపత్యం మరింతగా పెరిగే అవకాశాన్ని ఏ విధంగానూ కొట్టేయలేం. ఏఐకి సంబంధించిన అయిదు పెద్ద కంపెనీలు ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 240 బిలియన్ డాలర్లను (రూ.23 లక్షల కోట్లు) సేకరించాయి. చరిత్రలో ఒక అయిదు కంపెనీలు స్వల్పకాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధుల సమీకరణ చేయలేదు.

గుత్తాధిపత్యంతో మార్కెట్‌పై అదుపు సంపాదించటానికి ఎంతగా అవకాశం ఉన్నా అది అన్ని సందర్భాల్లోనూ అనుకున్నట్లుగా సాగదు. పెద్ద కంపెనీల మధ్య పోటీని పూర్తిగా నివారించలేం. క్యాపిటలిజంలో ఉన్న మౌలిక లక్షణమే అది. కంపెనీలు గుత్తాధిపత్యంతో సంతృప్తి చెందితే ఐటీ విప్లవం వచ్చేది కాదు. ఈనాటి ఏఐ అభివృద్ధి అయ్యేదీ కాదు. అపరిమిత లాభాపేక్ష కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను సృష్టిస్తుంది. దీనికితోడు కొత్తవి సృష్టించాలనే మనుషుల తపన వల్ల ఏదో ఒక స్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు ఊపిరిపోసుకుంటూనే ఉంటాయి. గుత్తాధిపత్యం అంటే పెద్ద కంపెనీల మధ్య సమానత్వం ఉన్నట్లు కాదు. వాటి మధ్య ఉన్న అసమానతలు కూడా పోటీకీ, అధిక లాభాన్వేషణకూ దారితీస్తాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం అనే అస్త్రంతోనే ప్రత్యర్థి కంపెనీలపై పైచేయి సాధించటానికి ప్రయత్నిస్తాయి. అయితే ఈ పోటీ ఏఐ యుగంలో హద్దులు దాటితే సృష్టికర్తల నియంత్రణే జారిపోయే ప్రమాదం ఉంటుంది. అదంటూ జరిగితే ఏ విపరిణామాలు తలెత్తుతాయో ఇప్పటికిప్పుడు ఊహించటం కష్టం. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మనుషులు సృష్టించిన ఏఐ మానవ నియంత్రణలో ఉంటుందా? అని 2014లోనే ప్రశ్నించారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ ప్రధానంగా మనం ఇచ్చే ఆదేశాలను అమలుచేసేవనీ, ఏఐ మనుషుల నిర్ణయాలనే ప్రభావితం చేయగలదంటూ యూవాల్ నోవా హరారి చేసిన వ్యాఖ్యానంలో నిజం లేకపోలేదు. ఏఐ మీద విపరీతంగా ఆధారపడే మనం సమాచారాన్ని మొత్తం ఏఐ గుప్పిట్లో పెడుతున్నాం. మన భయాలు, కోరికలు, బలహీనతలు, భావోద్వేగాలను అర్థంచేసుకుని మన నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి ఏఐ చేరుకుంటోందనీ దీన్ని 'హ్యాకింగ్ హ్యూమన్స్'గా హరారి వ్యాఖ్యానించారు. మనుషులు తమ నిర్ణయాధికారాన్ని ఏఐకి అప్పగించుకుంటూ పోతే క్రమేపీ మేధోపరమైన వివేచనా శక్తులనే కోల్పోతారన్న భయాన్నీ హరారే వ్యక్తంచేశారు. మనుషులతో కాకుండా ఏఐతో ఉద్వేగ సంబంధాలను ఏర్పరచుకుంటే మానవ సామాజిక అస్తిత్వమే బలహీనపడుతుంది. సజీవ మనుషులతో సంబంధాలు సన్నగిల్లితే కళలూ, సాహిత్యాలూ చిన్నబోతాయి. దీంతో మానవ సారమే పలచబడిపోతుంది. మనిషి సజీవతత్వాన్ని తెలుసుకునే మార్గమే మూతపడిపోతుంది.హరారే లాంటి వాళ్లు ఏఐ ప్రమాదాల గురించి చెబుతున్న దానిపై ఎన్నో భేదాభిప్రాయాలు ఉన్నాయి. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం. ఏఐతో ఉద్యోగాలు పోయి, నాలుగైదు కంపెనీల గుత్తాధిపత్యం పెరిగితే ఆదాయంలోనూ సంపదలోనూ అసమానతలు విపరీతంగా పెరిగిపోతాయి.

ఉద్యోగాలను కోల్పోతే వస్తువులకూ సేవలకూ డిమాండు తగ్గిపోతుంది. ఆర్థిక వ్యవస్థ

## 23 రోజుల్లో 6 వేల మీటర్లకు పైబడిన 20 పర్వత శిఖరాల అధిరోహణ

### చరిత్ర సృష్టించిన నిమాస్ పర్వతారోహక బృందం యాత్రను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:**
లద్దాఖ్‌లో ఇప్పటివరకు ఎవరూ అధిరోహించని, ఆరు వేల మీటర్లకు పైగా ఎత్తున్న 20 పర్వత శిఖరాలను కేవలం 23 రోజుల్లో అధిరోహించి చరిత్ర సృష్టించిన 'ఫస్ట్ అసెంట్ మౌంటెనీరింగ్ ఎక్స్‌పెడిషన్' బృందానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఘన స్వాగతం పలికారు. లద్దాఖ్ పర్వత శ్రేణిలోని చామ్సర్--లుంగ్సర్, గ్యామా నాలా, చోకులా ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎవరూ అధిరోహించని 20 శిఖరాలను ఒకే యాత్రలో అధిరోహించడం ఇదే తొలిసారి. దిరాంగ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్)కు చెందిన 20 మంది నైపుణ్యం కలిగిన పర్వతారోహకులు ఈ సాహసయాత్రలో పాల్గొన్నారు. కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ బృందానికి నాయకత్వం వహించారు.

**పర్వతారోహకుల ధైర్యం ప్రశంసనీయం**

యాత్రా బృందంతో మాట్లాడిన రాజ్‌నాథ్ సింగ్, ఈ చారిత్రక విజయాన్ని సాధించడంలో పర్వతారోహకులు ప్రదర్శించిన ధైర్యం, సంకల్పం, పట్టుదలను ప్రశంసించారు. భారత పర్వతారోహణ ప్రతిభకు, సాహస క్రీడల్లో దేశ నాయకత్వానికి ఈ యాత్ర నిదర్శనమని పేర్కొన్నారు.
ఈ బృంద సభ్యులు యువతకు స్ఫూర్తిదాయకులని ఆయన అభివర్ణించారు. వారి విజయం పర్వతారోహణ రంగంలో నూతన ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. దేశవ్యాప్తంగా యువ పర్వతారోహకులు సాహస యాత్రలు, అన్వేషణలవైపు అడుగులు వేసేందుకు ఈ ఘనత ప్రోత్సాహాన్నిస్తుందని చెప్పారు.

**ప్రపంచ పర్వతారోహణ పటంలో భారత్‌కు ప్రత్యేక స్థానం**

ఈ యాత్రలో అసాధారణ ప్రణాళిక, సాంకేతిక నైపుణ్యం, శారీరక దృఢత్వం, సమష్టి కృషి స్పష్టంగా కనిపించాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో పర్వతారోహణ చేయగల భారత్ సామర్థ్యాన్ని ఈ యాత్ర ప్రపంచానికి చాటిందని పేర్కొంది.
సరిహద్దుల్లో సాహసం, అన్వేషణ స్ఫూర్తిని ప్రోత్సహించడంతోపాటు భవిష్యత్తు తరాల పర్వతారోహకులకు ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ యాత్రను నిర్వహించారు.
న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్--2లో జరిగిన స్వాగత కార్యక్రమంలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్‌తోపాటు రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సమర్థవంతమైన అటవీ నిర్వహణకు సామర్థ్య పెంపు

## ప్రాజెక్టు వర్క్‌షాప్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

2025--26 నుంచి 2031--32 వరకు అమలు చేయనున్న ఈ సామర్థ్య పెంపు ప్రాజెక్టు ద్వారా మారుతున్న అటవీ, వన్యప్రాణుల నిర్వహణ అవసరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది సామర్థ్యాలను మెరుగుపరచనున్నారు. వాతావరణ, పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది నిర్వహిస్తున్న విభిన్న బాధ్యతలకు తగిన శిక్షణ అందించడం కూడా ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.
పరిశోధన, అభివృద్ధి వ్యవస్థలను బలోపేతం చేయడంతోపాటు శాస్త్రీయ అధ్యయనాల ఫలితాలను మెరుగైన శిక్షణ కార్యక్రమాలు, సుస్థిర అటవీ నిర్వహణ పద్ధతులుగా మార్చేందుకు ప్రాజెక్టు దోహదపడనుంది.
వర్క్‌షాప్ ప్రారంభ సమావేశంలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ అటవీ రంగంలో భారత్--జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సహకారంలో ఈ ప్రాజెక్టు ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, అడవులపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవనోపాధికి మద్దతు అందించడంలో అటవీ సంపద కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.
క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది కార్యనిర్వహణ, పరిపాలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాంతాలవారీ పరిస్థితులకు అనుగుణంగా స్థానిక పరిజ్ఞానం, సవాళ్లను ప్రతిబింబించే సామర్థ్య పెంపు శిక్షణ మాడ్యూళ్లను రూపొందించాలని సూచించారు. తాజా శాస్త్రీయ విధానాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.
అటవీ అగ్నిప్రమాదాల నిర్వహణ ప్రపంచవ్యాప్తంగా ప్రధాన సవాలుగా మారిందని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులపై చర్యల విషయంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రాజెక్టులో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు.
సామర్థ్య పెంపు కార్యక్రమాలు తరగతి గది శిక్షణకే పరిమితం కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతలు, క్షేత్రస్థాయిలో ఉత్తమ విధానాల అమలుపై ప్రధానంగా దృష్టి సారించడంతోపాటు స్థానిక సమాజాల పరిజ్ఞానం, అనుభవాలను కూడా సమీకరించాలని సూచించారు.

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

నోయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.
ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమై ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

## గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హీరమండలం: వంశధార నదిపై నిర్మించిన గొట్టా బ్యారేజ్ వద్ద వరద ప్రవాహం పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి సైరన్ మోగించారు. బ్యారేజ్ పూర్తి నీటి మట్టం 0.6619 టీఎమ్‌సీలుగా కాగా.. ప్రస్తుత నీటి మట్టం 0.2404 టీఎమ్‌సీలుగా ఉంది. 4 గేట్లను 60 సెం.మీ, 15 గేట్లను 80 సెం.మీ మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నది దిగువకు 40,079 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, ఇన్ ఫ్లో 36,690 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 40,079 క్యూసెక్కులుగా నమోదైంది. ఎడమ, కుడి కాలువలు మూసివేసి ఉంచారు. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో వంశధార పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## బాలాపూర్ లడ్డూకు రికార్డు ధర

మొదటిపేజీ తరువాయి

భగవంతుడు సుఖసంతోషాలను అందించారనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన ఉత్సవ సమితి.. ఆ తర్వాత బయట వ్యక్తులనూ అనుమతించింది. అలా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు 31 సార్లు వేలం వేయగా.. 2020లో కరోనా నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. 2024లో కొలను శంకర్‌రెడ్డి రూ.30.01లక్షలకు, గతేడాది లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

## వ్యవసాయ రంగంలో సీఎస్ఆర్ సహకారానికి పరిశ్రమలతో ఐకార్ భాగస్వామ్యాలను సులభతరం చేసిన అగ్రిఇన్నోవేట్ ఇండియా

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:**
అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ 15వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం), 71వ బోర్డు సమావేశం సెప్టెంబరు 24న న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్), మూడు పారిశ్రామిక సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి.
పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవరెస్ట్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఐకార్ కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందాలకు అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ సహకారం అందించింది.
వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాల అమలుకు పారిశ్రామిక సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను వినియోగించుకోవడం ఈ భాగస్వామ్యాల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఐకార్ డైరెక్టర్ జనరల్, అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎల్. జాట్, ఐకార్ కార్యదర్శి, అగ్రిఇన్నోవేట్ వైస్ చైర్మన్ జ్ఞానేంద్ర త్రిపాఠి, ఐకార్ ఆర్థిక సలహాదారు సందీప్ సర్కార్, అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ సీఈఓ డాక్టర్ ప్రవీణ్ మాలిక్, సంస్థ బోర్డు సభ్యులు, అగ్రిఇన్నోవేట్ బృందం, ఐకార్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.
ఈ భాగస్వామ్యాల ద్వారా సుస్థిర వ్యవసాయ--ఆహార వ్యవస్థలు, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సహజ వనరుల నిర్వహణ, జీవనోపాధుల మెరుగుదల, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, మహిళలు--యువత సాధికారత వంటి ప్రాధాన్య రంగాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు.
వ్యవసాయ స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్, గ్రామీణ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, డిజిటల్ ఆవిష్కరణలు, సామర్థ్య వికాసం, పోషకాహార ఆధారిత వ్యవసాయం, బయోఫోర్టిఫికేషన్, ఆహార శుద్ధి, విలువ ఆధారిత సరఫరా వ్యవస్థల అభివృద్ధి, వ్యవసాయ యాంత్రీకరణ, విద్య--విజ్ఞాన భాగస్వామ్యాలు, 'వన్ హెల్త్'తోపాటు పరస్పరం అంగీకరించిన ఇతర రంగాల్లోనూ కలిసి పనిచేయనున్నారు.
భారత వ్యవసాయ పరిశోధనా మండలికి చెందిన అగ్రిఇన్నోవేట్ ఇండియా లిమిటెడ్ వ్యవసాయ వ్యాపారం, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వాణిజ్యీకరణతోపాటు సీఎస్ఆర్ నిధుల సమీకరణ విభాగంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

### ఆరు దేశాల రాయబారుల నుంచి ఆధారపత్రాలు స్వీకరించిన

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:**
ఫిన్లాండ్, వియత్నాం, మెక్సికో, ఎస్టోనియా, యూరోపియన్ యూనియన్, బెల్జియం దేశాలకు చెందిన రాయబారులు తమ నియామక ఆధారపత్రాలను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి వారి ఆధారపత్రాలను స్వీకరించారు.
ఆధారపత్రాలు సమర్పించిన రాయబారులు:
1. మిక్కో కివికోస్కి --- ఫిన్లాండ్ రాయబారి
2. త్రిన్హ్ మిన్ మాన్ --- సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం రాయబారి
3. పెడ్రో బ్లాంకో పెరెజ్ --- మెక్సికో రాయబారి
4. క్రిస్టి కరెల్సోన్ --- రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా రాయబారి
5. జీన్-ఎరిక్ పాకెట్ --- యూరోపియన్ యూనియన్ రాయబారి
6. సోఫీ కార్ల్‌షాసెన్ --- బెల్జియం రాజ్య రాయబారి

ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో అధికారికంగా జరిగింది.

## దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. పలుచోట్ల జలఫిరంగుల ప్రయోగం



దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో దిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రూపంలో ఉన్న మాస్క్‌లను ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు దిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌ను పోలీసులు నిర్బంధించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్‌కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

# మిడ్ మానేరు నిర్వాసితుల హామీలు అమలు చేయాలి: డా. చెన్నమనేని వికాస్

**సీఎం సిరిసిల్ల పర్యటన సందర్భంగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి బీజేపీ డిమాండ్**
**హామీలు కాదు.. అమలు కావాలి: మిడ్ మానేరు నిర్వాసితుల తరపున బీజేపీ గళం**



వేములవాడ / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చెన్నమనేని వికాస్ డిమాండ్ చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రానున్న నేపథ్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల ప్రతి నిర్వాసిత కుటుంబానికి ?5.04 లక్షల పరిహారం మంజూరు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉపాధి హామీని అమలు చేయాలని కోరారు. నిర్వాసితుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల కింద ఎంతమందికి ఇళ్లు మంజూరయ్యాయి, ఎంతమంది నిర్మించుకున్నారనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్పులు, బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని, మిడ్ మానేరు బాధితులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఇకనైనా పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు బుర్ర శేఖర్, సిరికొండ శ్రీనివాస్, లింగంపల్లి శంకర్, జింక అనిల్, సురువు వెంకట్, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, ఎరుగొక్కుల రమేష్, రేగుల సంతోష్ బాబు, జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకులు పండిత్ దీన్ దయల్ జయంతి వేడుకలు

ముస్తాబాద్/ సెప్టెంబర్ 25 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు ఘనంగా వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సొల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేసి, "ఏకాత్మ మానవతావాదం", అంత్యోదయ,సిద్ధాంతాలను సమాజానికి అందించారని కొనియాడారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు బీద ప్రజలకు చేరాలన్న ఆయన ఆశయాలకు అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం ఉజ్వల, జనధన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన వంటి పథకాల ద్వారా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. "సబ్ కా సాత్ -- సబ్ కా వికాస్ -- సబ్ కా విశ్వాస్ -- సబ్ కా ప్రయాస్" అనే స్ఫూర్తితో ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేయడమే దీన్‌దయాళ్ కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 2047 నాటికి ఆత్మనిర్భర్, సమృద్ధ, సమర్థ, సంపన్న భారత్ నిర్మాణానికి ప్రతి బీజేపీ కార్యకర్త క్రమశిక్షణతో, నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా



ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్ ఉపసర్పంచ్ కోలకృష్ణ జిల్లెల్ల మల్లేశం బాధ నరేష్,దీటి సత్యం, వార్డు మెంబర్ వేణు యాదగిరి,ఒరగంటి సత్యం,వినయ్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 30న సిరిసిల్లలో జరిగే సీఎం సభకు కాంగ్రెస్ క్యాడర్ సన్నద్ధం కావాలి

**ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు**





ముస్తాబాద్/ సెప్టెంబర్ 25 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న తలపెట్టనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ క్యాడర్ తో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కో కన్వీనర్ చక్రదర్ రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి,మాట్లాడుతూ. సిరిసిల్ల నియోజకవర్గం లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను మంజూరు చేయడం ద్వారా సిరిసిల్ల అభివృద్ధి బాటలో పయనిస్తోందని నిరూపించారు ఇది కేవలం స్కూల్ కాదు,సిరిసిల్ల భవిష్యత్తుకు పునాది. గతంలో బి ఆర్ ఎస్ పార్టీ 10 ఏళ్లు అధికారంలో ఉండి సిరిసిల్లకు చేసిందేమీ లేదు. అభివృద్ధి పేరుతో మాయమాటలు చెప్పారు. కానీ మా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలలో నేతన్న బకాయి బిల్లులు చెల్లించి సిరిసిల్ల నేతల ముఖాలలో చిరునవ్వు చూసిన ఘనత సిరిసిల్లకు 200 కోట్ల భారీ విద్యా సంస్థను తెచ్చి బి ఆర్ ఎస్ పార్టీకి గట్టిగా సమాధానం ఇచ్చింది. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక బి ఆర్ ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. సిరిసిల్ల ప్రజల చిరకాల కోరిక తీర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనన్న మండల ప్రజల పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. సెప్టెంబర్ 30న జరిగే సీఎం సభను ముస్తాబాద్ మండలం నుండి ప్రతి గ్రామం నుండి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి పార్లమెంట్ కో కన్వీనర్ కనమెని చక్రధర్ ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి మరియు గ్రామ శాఖ అధ్యక్షులు మరియు మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు, యూత్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
4

# 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేసి, రాయిని చెరువుకు సాగునీరు అందించాలి...

**ఈ నెల 28న మద్దిమల్ల గ్రామం నుంచి వీర్నపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ**
**రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి**
**మండల అధ్యక్షుడు లక్ పతి నాయక్**



వీర్నపల్లి సెప్టెంబర్ 25 ప్రజా దివాస్
కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేసి, ఉమ్మడి మద్దిమల్ల పరిధిలోని రాయిని చెరువుకు సాగునీరు అందించాలని బీజేపీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు లఘుపతి నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. ఎండిపోతున్న పంటలు: 9వ ప్యాకేజీ పనులు పూర్తికాక రాయిని చెరువు ఎండిపోవడంతో పంట పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు రావాల్సిన పైప్‌లైన్ పనులను కంచర్ల అటవీ ప్రాంతంలో ఎందుకు నిలిపివేశారో ప్రభుత్వం, పాలకులు స్పష్టం చేయాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మోసం: గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వం 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయకుండా గాలికి వదిలేసింది. 11, 12 ప్యాకేజీలు పూర్తి చేసి నీటిని మళ్లించారే తప్ప, సిరిసిల్ల ప్రాంత రైతులను నిలువునా మోసం చేశారు. కాంగ్రెస్ హామీ ఏమైంది?: గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎల్లారెడ్డిపేటకు వచ్చిన రేవంత్ రెడ్డి గారు 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలి. ఈ నెల 28న భారీ ర్యాలీ: ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీ రెడ్డబోయిన గోపి గారి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన మద్దిమల్ల గ్రామం నుండి వీర్నపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ పాదయాత్ర నిర్వహిం

# డీజే మోగితే... కటకటాలే.!

**నిబంధనలు మీరితే చర్యలు తప్పవు: ఎస్సై రామ్మోహన్ హెచ్చరిక...**
**కోనరావుపేటలో వాహనం సీజ్.. నిర్వాహకులపై కేసు..**

కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
అనుమతులు లేకుండా అధిక శబ్దాలతో డీజే నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని



కోనరావుపేట ఎస్సై రామ్మోహన్ స్పష్టం చేశారు. గ్రామ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భారీ శబ్దంతో డీజే పెట్టి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు శుక్రవారం రంగంలోకి దిగారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీజే సౌండ్‌ను నిలిపివేయించారు. సంబంధిత డీజే పరికరాలతో పాటు తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని (ఏపీ 29 టీఏ 6445) సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీజే ఆపరేటర్‌తో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, చట్టబద్ధంగా జరుపుకోవాలని ఆయన కోరారు. అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు, రోగులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా బందోబస్తు నిర్వహించాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే





రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
సిరిసిల్ల పట్టణంలో వినాయక శోభాయాత్ర, నిమజ్జన మహోత్సవాల సందర్భంగా బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. శోభాయాత్ర మార్గాల్లోనూ, నిమజ్జన ప్రాంతాల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయానికి కార్యక్రమాలన్నీ సజావుగా పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# మానేరు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్







సిరిసిల్ల పట్టణ పరిధిలోని మానేరు వంతెన వద్ద జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే పోలీస్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమయ్యారు. శోభాయాత్ర, నిమజ్జన మహోత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్దేశిత సమయానికి పూర్తయ్యేలా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
ఈ నెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించను న్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రతా చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు: మున్సిపల్ చైర్‌పర్సన్**
**ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం పూర్తి చేయాలి: జిందం కళ చక్రపాణి**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్





వినాయక నిమజ్జన మహోత్సవంలో భాగంగా సిరిసిల్లలోని కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా సమీపంలో గల మానేరు నది తీరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని నిమజ్జన మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే భక్తులకు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. మానేరు నది తీరంలో బారికేడ్లు, విద్యుత్ దీపాలు, భారీ క్రేన్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాల ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. వీటి పర్యవేక్షణ కోసం అధికారులను నిరంతరం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. భక్తులు, నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుడిని ఆధ్యాత్మిక వాతావరణంలో, శోభాయాత్రగా నిర్వహించి గంగమ్మ ఒడికి చేర్చాలని పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావరణంలో, బాధ్యతాయుతంగా ఈ నిమజ్జన వేడుకల్లో పాల్గొనాలని కోరారు. అలాగే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ బత్తుల రమేష్, మున్సిపల్ అధికారులు, పుర ప్రముఖులు, వినాయక మండప నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా పాటను ప్రజల గొంతుకగా మలిచిన విమలక్కకు చిందు కళాకారుల ఘన నివాళి

**62వ జన్మదినం -- అరుణోదయ కళా ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్





ప్రజా పాటను ప్రజల గొంతుకగా మలిచి, ఐదు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలు, సామాజిక సమస్యలు, శ్రమజీవుల జీవితాలను తన గానంతో ప్రతిధ్వనింపజేస్తున్న కామ్రేడ్ విమలక్కకు తెలంగాణ చిందు యక్షగాన కళాకారులు ఘన నివాళులు అర్పించారు. అరుణోదయ సాంస్కృతిక కళారంగంలో ఆమె 50 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకోవడం, అలాగే 62వ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభినందనలు తెలిపారు.తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం ధనుంజయ విడుదల చేసిన ప్రకటనలో, విమలక్క కేవలం గాయని మాత్రమే కాదని, ప్రజల బాధలు, ఆకాంక్షలు, పోరాటాలను పాట రూపంలో వ్యక్తపరిచిన ప్రజా కళాకారిణి అని పేర్కొన్నారు. ఆమె కాలి గజ్జెల సవ్వడి ప్రజల కష్టాల ప్రతిధ్వనిగా, చేతిలోని డప్పు సమాజాన్ని చైతన్యపరిచే నాదంగా మారిందని కొనియాడారు.యక్షగాన కళాకారులు పురాణాలు, ఇతిహాసాలను ప్రజలకు చేరవేసినట్లే, విమలక్క ప్రజల జీవితాల్లోని అన్యాయాలు, పోరాటాలు, ఆశయాలను పాటల రూపంలో ప్రజలకు చేరవేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాల చరిత్రను, అమరవీరుల త్యాగాలను తన గానంలో మోసిన గొంతు విమలక్కదేనని పేర్కొన్నారు.ప్రజలను అలరించే కళాకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ, ప్రజలను ఆలోచింపజేసి చైతన్యపరిచే కళాకారిణిగా విమలక్క ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఆమె పాటలు తరతరాల ప్రజా కళాకారులకు స్ఫూర్తిగా నిలిచాయని తెలిపారు.ఈ సందర్భంగా కామ్రేడ్ విమలక్కకు 62వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ప్రజా కళా ప్రస్థానం మరింత కాలం కొనసాగాలని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు."కళ ప్రజల కోసం... పాట ప్రజల కోసం... గొంతు ప్రజల కోసం..." అనే నినాదంతో విమలక్క ప్రజా కళా సేవలను కొనియాడుతూ చిందు యక్షగాన కళాకారులు అభివందనలు తెలిపారు.గడ్డం ధనుంజయ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి.

## బావుసాయిపేట అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన

కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్





పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోనరావుపేట మండలం బావుసాయిపేట అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ యాస్మిన్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు తొలిసారి అన్నప్రాసన చేయించిన అనంతరం తల్లులకు పౌష్టికాహారం, సమతుల్య ఆహారం, పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందని సర్పంచ్ తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా ఐరన్, కాల్షియం, ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకుంటూ సొంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ప్రతి తల్లి పోషకాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ గంగ లక్ష్మి, టీచర్లు కనక లక్ష్మి, మాధవి, ఆశా వర్కర్ బాబాయి మరియు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## మరొకరితో వెళ్లిపోయేందుకు సిద్ధపడిందని.. తల్లిని చంపిన కుమారుడు

**హనుమకొండ జిల్లా కాజీపేటలో ఘటన**

హన్మకొండ జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్



ఆమెకు పెళ్లయింది.. ఇద్దరు పిల్లలు.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో ఆమె ఆ వ్యక్తితో వెళ్లిపోయేందుకు సిద్ధపడడంతో తట్టుకోలేక కుటుంబ సభ్యుల ముందే కుమారుడు తన తల్లిని కత్తితో పొడిచి చంపాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలాజీనగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన నాగుల ఉదయశ్రీ (40)కి హైదరాబాద్ ఉప్పల్ పరిధిలో స్విగ్గీలో పనిచేస్తున్న రాజశేఖర్‌తో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో రాజశేఖర్ ఆమెను ఇల్లు విడిచి తనతో రావాలని కొద్దిరోజులుగా ఒత్తిడి చేస్తున్నాడు. రాజశేఖర్ రెండు రోజులుగా ఆమెకు ఫోన్‌చేసి హైదరాబాద్‌కు రావాలని, వస్తే పెళ్లి చేసుకుంటానని, రానిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు సమాచారం. ఈ ఒత్తిడిని భరించలేక ఉదయశ్రీ గురువారం తాను హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పగా భర్త, కుమార్తె, కుమారుడు ఇంటినుంచి వెళ్లొద్దంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా, ఆమె వినిపించుకోలేదని సమాచారం. దీంతో ఆగ్రహానికి గురైన కుమారుడు దొరబాబు కత్తితో తల్లిపై దాడి చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. తీవ్ర గాయాలతో ఉదయశ్రీ అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, రాజశేఖర్‌కు కూడా భార్య, పిల్లలు ఉన్నట్టు సమాచారం. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.ఘటనా స్థలానికి ఉన్నతాధికారులుహత్య సమాచారం అందుకున్న వెంటనే డీసీపీ ధార కవిత, ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, సీఐ శ్యాంసుందర్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించడంతోపాటు కుటుంబ సభ్యులను విచారించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఉదయశ్రీ-రాజశేఖర్ మధ్య ఉన్న సంబంధంపై కూడా ఆరా తీస్తున్నారు. ఉదయశ్రీ సెల్‌ఫోన్ కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

## ముఖ్యమంత్రి సభ స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్

ఈనెల 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తో కలిసి సభ నిర్వహించే ప్రదేశాన్ని, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరయ్యే క్రమంలో పట్టణంలోకి ప్రవేశించే మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.ప్రత్యేకంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, చంద్రంపేట చౌరస్తా ప్రాంతాలను పరిశీలించి, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.భారీ సంఖ్యలో ప్రజలు సభకు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు..



## చేనేత చట్టాన్ని ఉల్లంఘించే పవర్లూమ్ యజమానులపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్



చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పవర్లూమ్స్‌పై చేనేత చీరలను ఉత్పత్తి చేస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేనేత, జౌళి శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మూశం రమేష్ మాట్లాడుతూ.. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని యజమానులు బహిరంగంగా ఉల్లంఘిస్తూ అక్రమంగా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారని మండిపడ్డారు. కూలీ పెంచాలని కోరుతూ కార్మికులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు ఆదేశించినా యజమానులు ఏమాత్రం పట్టించుకోకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.గత కొన్నేళ్లుగా పవర్లూమ్స్‌పై చేనేత ఉత్పత్తులు తయారు చేస్తూ కార్మికుల శ్రమను దోచుకున్న యజమానులపై ఏసీబీ (ూజదీ) అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళనకు స్పందించిన జౌళి శాఖ ఏడీ పవర్లూమ్స్‌పై చేనేత వస్త్రాల ఉత్పత్తి జరిగితే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు చిరంజీవి, వీరేశం, మార్కండేయులు, ప్రతాప్, ఆనందం, గుండేటి శ్రీనివాస్, గుండేటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ఫైర్ ఆఫీసర్ నాగు అనిల్ కుమార్ గుండెపోటుతో మృతి

**డ్రైవర్ స్థాయి నుంచి అధికారిగా ఎదిగిన నాగు అనిల్ కుమార్ గుండెపోటుతో కన్నుమూత**

వేములవాడ / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్



వేములవాడ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నాగు అనిల్ కుమార్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 2008 బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరి, శ్రమతో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు. గత రెండేళ్లుగా వేములవాడ అగ్నిమాపక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. వేములవాడలో అగ్నిప్రమాద నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పలు అగ్నిప్రమాదాల్లో సిబ్బందితో కలిసి పాల్గొని ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించారు. ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. అనిల్ కుమార్ అంత్యక్రియలు సాయంత్రం ఆయన స్వగ్రామమైన నల్గొండ జిల్లా తుమ్మలగూడెంలో జరగనున్నాయి.

## రేపటి ముదిరాజ్ సింహగర్జన సభను విజయవంతం చేయాలి: పెండ్యాల శంకర్

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 25 ప్రజాదివాస్




ముదిరాజుల రిజర్వేషన్, విద్య, ఉద్యోగ, రాజకీయ హక్కుల సాధన కోసం శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'హలో ముదిరాజ్.. చలో సిరిసిల్ల' సింహగర్జన సభను విజయవంతం చేయాలని వేములవాడ రూరల్ ముదిరాజ్ మండల అధ్యక్షుడు పెండ్యాల శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ సభకు జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ కులబాంధవులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని కోరారు. బీసీ-ఏ (దీజ-ూా) వర్గీకరణ సాధనే లక్ష్యంగా ముదిరాజులు ఐక్యంగా పోరాడాలని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేస్తూ ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చి 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన ముదిరాజ్ మత్స్యకారులకు వెంటనే ఆసరా పెన్షన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజుల ఆత్మగౌరవం, భవిష్యత్ తరాల బాగు కోసం చేపడుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

# ప్రజాసేవకు ప్రతిరూపం సిలారపు దామోదర రాజనర్సింహా

**ఆందోల్ అభివృద్ధి ప్రస్థానంలో సి డి ఆర్ గారిది సుదీర్ఘ అధ్యాయం.**

సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
ప్రజల మధ్య పుట్టిన నాయకత్వం...ప్రజల సమస్యల నుంచి పుట్టిన ఆలోచన...
ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్న కార్యాచరణ...ఈ మూడు కలిసినప్పుడే ప్రజాప్రతినిధిత్వానికి నిజమైన అర్థం వస్తుంది.ఆందోల్ నియోజకవర్గ రాజకీయ ప్రస్థానంలో సిలారపు దామోదర రాజనర్సింహ గారి పేరు సుదీర్ఘ ప్రజాజీవితంతో ముడిపడి ఉంది. దశాబ్దాల రాజకీయ అనుభవాన్ని, ప్రజలతో ఏర్పడిన అనుబంధాన్ని, పాలనా వ్యవస్థపై తనకున్న అవగాహనను నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమైన భాగంగా చెప్పవచ్చు.ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం అంటే కేవలం కొన్ని భవనాలు నిర్మించడం కాదు. రైతు పొలానికి నీరు చేరాలి... విద్యార్థి పాఠశాలకు సురక్షితంగా చేరాలి... పేద కుటుంబానికి వైద్యం అందాలి... యువతీ యువకులకు ఉపాధి దొరకాలి... మహిళకు ఆర్థిక భరోసా కలగాలి... వృద్ధుడికి సంక్షేమ పథకం అందాలి... గ్రామానికి రహదారి రావాలి... ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు చేరువ కావాలి.ఈ సమగ్ర దృష్టితో ఆందోల్ అభివృద్ధిని చూడాల్సిన అవసరాన్ని దామోదర రాజనర్సింహా గారి రాజకీయ ప్రయాణం ముందుకు తెస్తుంది.

## సిలారపు కుటుంబం ప్రజాజీవితంతో పెనవేసుకున్న బంధం

సిలారపు కుటుంబ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించినప్పుడు ప్రజలతో ఉన్న అనుబంధం ఒక ప్రధాన అంశంగా కనిపిస్తుంది. తండ్రి సిలారపు రాజ నరసింహ గారు ప్రజాజీవితంలో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి వారి కుటుంబ రాజకీయ వారసత్వానికి ఒక పునాదిగా నిలిచిందని ఆయనను అభిమానించే కార్యకర్తలు, అభిమానులు సామాజిక వర్గాలు పేర్కొంటారు.

వారసత్వాన్ని కొనసాగిస్తూ దామోదర రాజనర్సింహ గారు తనదైన రాజకీయ శైలిని ఏర్పరుచుకున్నారు.తండ్రి అడుగుజాడలు మార్గదర్శకత్వమైతే...తన అనుభవం కార్యాచరణకు బలమైంది.ప్రజల సమస్యలు లక్ష్యాలైతే...అభివృద్ధి వాటికి సమాధానంగా నిలవాలనే ఆలోచన ఆయన రాజకీయ ప్రయాణంలో కనిపిస్తుంది.రాజకీయ వారసత్వం అనేది కేవలం పేరు కాదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, కాలానుగుణంగా మారుతున్న అవసరాలను గుర్తించడం, కొత్త తరానికి కొత్త అవకాశాలను సృష్టించడం ఇవే వారసత్వానికి అసలైన అర్థాన్ని ఇస్తాయి. అటువంటి ఆలోచన విధానాన్ని కలిగిన మహా నాయకుడుగా నిలిచారు దామోదర్ రాజనర్సింహ గారు.

## ఆందోల్ ఒక నియోజకవర్గం కాదు, ఒక కుటుంబం అనే భావన

ప్రజాప్రతినిధికి నియోజకవర్గం ఒక భౌగోళిక పరిధి మాత్రమే కాదు. అక్కడ నివసించే ప్రతి కుటుంబం, ప్రతి రైతు, ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు, ప్రతి మహిళ, ప్రతి వృద్ధుడు అతని బాధ్యతలో భాగమే.ఆందోల్‌ను ఒక కుటుంబంలా భావించి అభివృద్ధి చేయాలనే భావనతో పనిచేస్తున్న నాయకుడిగా దామోదర రాజనర్సింహ గారిని అభివర్ణిస్తారు.ప్రజల సమస్యను వినడం, వారికి వెన్నతో పెట్టిన విద్య, దాని పరిష్కారం కోసం ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నించడం మరో బాధ్యత.గ్రామంలో ఒక రహదారి సమస్య అయినా...రైతుకు సాగునీటి సమస్య అయినా...విద్యార్థికి విద్యాసంస్థ అవసరమైనా...ప్రజలకు వైద్య సదుపాయం కావాలన్నా...ప్రభుత్వ కార్యాలయం అవసరమైనా...ప్రజల అవసరాన్ని అభివృద్ధి ప్రతిపాదనగా మార్చి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రక్రియలో దామోదర్ రాజనరసింహా గారిది పాత్ర కీలకం.

## వ్యవసాయం రైతు ముఖంలో ఆనందం

ఆందోల్ వంటి ప్రాంతాల్లో వ్యవసాయం గ్రామీణ జీవనానికి వెన్నెముక.
మంజీరా నది పరివాహక ప్రాంతంలోని సింగూరు ప్రాజెక్టు నియోజకవర్గానికి హృదయం లాంటిది,రైతు పొలంలో నీరు ఉంటే పంట పుడుతుంది.పంట పండితే కుటుంబానికి ఆదాయం వస్తుంది.ఆదాయం వస్తే పిల్లల చదువులు సాగుతాయి.కుటుంబం బలపడితే గ్రామం బలపడుతుంది.గ్రామం బలపడితే






నియోజకవర్గ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.అందుకే సాగునీరు, తాగునీరు చెరువులు, కాలువలు, నీటి వనరుల పరిరక్షణ, వ్యవసాయ మౌలిక వసతులు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత అవసరమని సిడిఆర్ నమ్మకం. నీటిపారుదల వ్యవస్థలకు సంబంధించిన పనులు, చెరువుల అభివృద్ధి, సాగునీటి లభ్యత వంటి అంశాలను రైతు సంక్షేమంతో అనుసంధానిస్తూ అభివృద్ధి చేయాలనే తపన దామోదర్ రాజనర్సింహా గారికి ఉంటుందని వారు చేసే ప్రతి పని ప్రయత్నం గురించి కార్యకర్తలు ప్రస్తావిస్తారు.నీరు కేవలం పొలాన్ని తడపదు;రైతు ఆశలను తడుపుతుంది.నీటి ప్రవాహం కేవలం కాలువలో ప్రవహించదు;గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రవహిస్తుంది.రైతు కళ్లలో ఆనందం కనిపించే రోజు నిజమైన అభివృద్ధి దినం అని సిడిఆర్ గారు నమ్ముతారు.

## విద్య, తరాల భవిష్యత్తును నిర్మించే శక్తి

ఒక నాయకుడు ఒక రహదారి నిర్మించగలడు. కానీ ఒక విద్యార్థికి నాణ్యమైన విద్య అందితే అతను తన జీవితానికి ఎన్నో రహదారులు నిర్మించుకోగలడు.
అందుకే విద్యా రంగ అభివృద్ధి ఏ ప్రాంతానికైనా అత్యంత కీలకం. అందుకే ఆందోల్ నియోజకవర్గాన్ని విద్యా అబ్ మార్చిన దామోదర్ రాజనర్సింహాగారు.
పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్య, వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ, విద్యార్థులకు ప్రభుత్వ సహాయం ఇవన్నీ సమగ్ర విద్యా వ్యవస్థలో భాగాలు మంత్రిగారి నమ్మకం.ఆందోల్ యువతకు విద్య అందుబాటులోకి రావడం, స్థానికంగా విద్యా అవకాశాలు పెరగడం, ఉన్నత విద్య వైపు విద్యార్థులను ప్రోత్సహించడం వంటి అంశాలు భవిష్యత్తు తరాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి.ఒక తరగతి గదిలో వెలిగే దీపం...ఒక కుటుంబ భవిష్యత్తును మార్చగలదు. స్త్రీ విద్య భవిష్యత్ తరాలకు వెలుగు దామోదర్ రాజనర్సింహ గారు బాలికల చదువుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు.ఒక విద్యార్థి విజయం...ఒక గ్రామానికి ప్రేరణగా మారగలదు.అందుకే విద్యాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు; సమాజ నిర్మాణంలో ప్రతి నాయకత్వం తీసుకోవాల్సిన బాధ్యత.

## వైద్యం పేదవాడి ప్రాణానికి భరోసా

ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండటం ఒక ప్రాంత అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన సూచిక.ఒక పేద కుటుంబం అనారోగ్యంతో ఆసుపత్రి గడప తొక్కినప్పుడు, ఆ కుటుంబం ముందున్న అతిపెద్ద ప్రశ్న డబ్బు కాకుండా చికిత్స అందుతుందా? అనే ప్రశ్న.ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, వైద్య సదుపాయాల విస్తరణ, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరడం, గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఇవన్నీ ప్రజా సంక్షేమంలో కీలక అంశాలు అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా వారి దృఢ సంకల్పం ప్రజల ఆరోగ్యం బాగుంటేనే ప్రాంత అభివృద్ధి బలంగా ఉంటుంది.అందుకే వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది, పరికరాలు, అత్యవసర సేవలు, ఆరోగ్య అవగాహన వంటి అంశాలపై నిరంతర దృష్టి అవసరం అందుకే ఆందోల్ నియోజకవర్గాన్ని వైద్య అబ్ గా సిడిఆర్ గారు మార్చడం జరిగింది

## యువత ఆందోల్ భవిష్యత్తుకు శక్తి

నేటి యువతే రేపటి ఆందోల్.యువతకు విద్యతో పాటు ఉద్యోగం కావాలి.ఉద్యోగంతో పాటు నైపుణ్యం కావాలి.నైపుణ్యంతో పాటు అవకాశాలు కావాలి.అవకాశాలతో పాటు పరిశ్రమలు, పెట్టుబడులు, స్వయం ఉపాధికి అనుకూల వాతావరణం కావాలి.యువతకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి పథకాలు, చిన్నతరహా వ్యాపారాలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒక యువకుడికి ఉద్యోగం వస్తే ఒక కుటుంబం నిలబడుతుంది.వందలాది యువతకు ఉపాధి లభిస్తే ఒక గ్రామం ఆర్థికంగా ఎదుగుతుంది.వేలాది యువతకు అవకాశాలు లభిస్తే ఒక నియోజకవర్గం కొత్త ఆర్థిక శక్తిగా ఎదగగలదు.అందుకే యువతకు ఉపాధి కల్పనను భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో కేంద్ర అంశంగా చూడాలి అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా వారి తపన.

## రవాణా అభివృద్ధికి రహదారి

అభివృద్ధి వేగంగా ప్రయాణించాలంటే రహదారులు బలంగా ఉండాలి.
మంచి రహదారి రైతు పంటను మార్కెట్‌కు చేరుస్తుంది.విద్యార్థిని విద్యాసంస్థకు చేరుస్తుంది.రోగిని ఆసుపత్రికి చేరుస్తుంది.ఉద్యోగిని కార్యాలయానికి చేరుస్తుంది.వ్యాపారాన్ని కొత్త మార్కెట్లకు చేరుస్తుంది.అందుకే గ్రామీణ రహదారులు, ప్రధాన రహదారులు, ప్రజా రవాణా, అంతర్గత గ్రామీణ కనెక్టివిటీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం.ఆందోల్‌లో ప్రతి గ్రామం అభివృద్ధి ప్రధాన ప్రవాహంతో అనుసంధానమైతేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది రహదారులకు, వంతెనలకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి గారు నియోజకవర్గం అభివృద్ధివైపు నడిపిస్తున్నారు.సంక్షేమంపథకం, ప్రజల గడప దాటినప్పుడే విజయం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందిస్తాయి. కానీ ఆ పథకాల అసలు విజయం అవి అర్హులైన ప్రజల గడపకు చేరినప్పుడు మాత్రమే కనిపిస్తుంది.ఆసరా పెన్షన్లు, రైతు బీమా, ఆరోగ్యశ్రీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్, ఇందిరమ్మ ఇండ్లు, వంటి కార్యక్రమాలు, విద్యుత్ రాయితీలు, పావలా వడ్డీ రుణాలు, చేయూత వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరేలా అవగాహన కల్పించడం ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తల సమన్వయంతో సాధ్యమవుతుంది.ప్రభుత్వ పథకాలు పేద కుటుంబానికి చేరినప్పుడు అది ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు ఆ కుటుంబానికి ఒక భరోసా గట్టిగా నమ్మే వ్యక్తిత్వం దామోదర్ రాజనర్సింహ గారిది.నిధుల సాధన అభివృద్ధికి ఆర్థిక పునాదిఅభివృద్ధి కోసం ఆలోచన ఎంత అవసరమో, దానికి ఆర్థిక వనరులు అంతే అవసరం.ఆందోల్ నియోజకవర్గానికి అవసరమైన పనులను గుర్తించడం, వాటి ప్రాధాన్యతను ప్రభుత్వానికి వివరించడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేయడం, నిధులు సాధించేందుకు ప్రయత్నించడం ప్రజాప్రతినిధి బాధ్యతలో కీలక నిర్ణయం, నిధులు సేకరించి నియోజకవర్గానికి అందించడంలో దామోదర రాజనర్సింహ గారి రాజకీయ అనుభవం ఈ విషయంలో ఒక బలంగా ఉంటుందని అనుచరులు భావిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో తనకున్న అనుభవం, సంబంధాలను ఉపయోగించి నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సాధించేందుకు వారు విశేష కృషి చేస్తారు.

## వాగ్దాటి వ్యక్తిత్వానికి అద్దం

రాజకీయ నాయకుడి మాట ప్రజలను ప్రభావితం చేయగలదు. కానీ ఆ మాట వెనుక ఉన్న బాధ్యతే అతని నాయకత్వాన్ని నిర్వచిస్తుంది.దామోదర రాజనర్సింహ గారి ప్రసంగ శైలిని ఆయనను అనుసరించే వారు హుందాతనంతో కూడిన వాగ్దాటిగా అభివర్ణిస్తారు. శాసనసభలోనైనా, ప్రజల మధ్యనైనా విషయాన్ని స్పష్టంగా చెప్పడం, తన అభిప్రాయాన్ని గౌరవప్రదంగా వ్యక్తం చేయడం ఆయన రాజకీయ శైలిలోని అంశాలుగా చెప్పవచ్చు.

## రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు సహజం

కానీ వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలి, రాజకీయ పోరాటాన్ని విధానాలపైనే పరిమితం చేయాలి అనే భావన ప్రజాస్వామ్య సంస్కృతికి ఎంతో అవసరం దామోదర్ రాజనర్సింహా గారు బలంగా నమ్ముతారు.ప్రత్యర్థిని విమర్శించడం కంటే ప్రత్యామ్నాయాన్ని చూపడం...విమర్శించడం కంటే పరిష్కారాన్ని సూచించడం...వాగ్వాదం కంటే విధానంపై చర్చించడం...ఇదే ప్రజాస్వామ్య రాజకీయాలకు మరింత ఆరోగ్యకరమైన మార్గం.

## కఠినమైన నిర్ణయం, మృదువైన మనసు

ప్రజా జీవితంలో ప్రతి నిర్ణయం అందరికీ నచ్చదు. కొన్ని సందర్భాల్లో నాయకుడు కఠినంగా మాట్లాడాల్సి రావచ్చు. కొన్ని సందర్భాల్లో నిర్ణయాలు కఠినంగా కనిపించవచ్చు. కానీ వ్యక్తిగతంగా ప్రజల పట్ల ఆప్యాయత, సహానుభూతి, మానవత్వం కలిగి ఉండటం నాయకుడి వ్యక్తిత్వాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతుంది.దామోదర రాజనర్సింహ గారిని అభిమానించే వారు ఆయనలోని ఆప్యాయత, ప్రజలను పలకరించే తీరు, ఆపన్నులకు అండగా నిలవాలనే మనస్తత్వాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తారు.ప్రజా నాయకత్వంలో హోదా కంటే మానవత్వం గొప్పది.

## -రాష్ట్ర రాజకీయాల్లో అనుభవం నియోజకవర్గానికి ఉపయోగపడే వనరు

ఒక నాయకుడి రాజకీయ అనుభవం నియోజకవర్గానికి ఉపయోగపడాలంటే ఆ అనుభవం అభివృద్ధి పనుల్లో ప్రతిబింబించాలి.రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవడం, వివిధ శాఖలతో సమన్వయం చేయడం, ప్రాంతీయ అవసరాలను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లడం, అవసరమైన నిధుల కోసం ప్రయత్నించడం వంటి అంశాల్లో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఒక వనరుగా మారుతుంది.దామోదర రాజనర్సింహ గారి రాజకీయ ప్రయాణాన్ని కూడా ఈ కోణంలో చూడవచ్చు.ఆందోల్ సమస్య రాష్ట్ర సమస్యగా మారినప్పుడు...రాష్ట్ర సమస్య జాతీయ చర్చలోకి వెళ్లినప్పుడు...ప్రజల అవసరం పాలనా నిర్ణయంగా మారినప్పుడు...
ప్రజాప్రతినిధిత్వం తన అసలైన అర్థాన్ని పొందుతుంది.

## వెయ్యి రోజుల అభివృద్ధి పనుల్లో కనిపించే సమాధానం

ఏ ప్రభుత్వానికైనా, ఏ ప్రజాప్రతినిధికైనా పనితీరును అంచనా వేయడానికి కాలపరిమితి కంటే పనుల ఫలితాలే ప్రధాన ప్రమాణం.వెయ్యి రోజుల పాలన గురించి మాట్లాడేటప్పుడు ఎన్ని కార్యక్రమాలు ప్రకటించబడ్డాయి అన్నదానికంటే ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఎంతమంది ప్రజలకు ప్రయోజనం కలిగింది? ఎంత నిధి వినియోగించబడింది? పనుల నాణ్యత ఎలా ఉంది? భవిష్యత్తులో వాటి ప్రయోజనం ఎంతకాలం కొనసాగుతుంది? అనే ప్రశ్నలు మరింత ముఖ్యమైనవి.ఆందోల్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఇదే ప్రమాణాలతో పరిశీలించినప్పుడే అభివృద్ధి యొక్క అసలైన పరిమాణం స్పష్టమవుతుంది. ఇప్పటికీ వారు చేసిన సేవలు కళ్ళ ముందు కనిపిస్తుంటాయి.భవిష్యత్తు ఆందోల్ ఎలా ఉండాలి భవిష్యత్తు ఆందోల్‌ను ఊహిస్తే కొన్ని స్పష్టమైన లక్ష్యాలు కనిపించాలి.రైతుకు నిరంతర సాగునీరు కావాలి.యువతకు స్థానిక ఉపాధి కావాలి.విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి.ప్రతి కుటుంబానికి అందుబాటులో వైద్యం కావాలి.ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి కావాలి.ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకం చేరాలి.మహిళలకు ఆర్థిక స్వావలంబన కావాలి.చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం కావాలి.పరిశ్రమలకు అనుకూల వాతావరణం కావాలి.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిపాలన కావాలి.ఈ లక్ష్యాల దిశగా ఆందోల్ ముందుకు సాగితేనే అభివృద్ధి నిజమైన అర్థాన్ని పొందుతుంది.

## ప్రజల మధ్య కొనసాగాల్సిన ప్రస్థానం

సిలారపు దామోదర రాజనర్సింహ గారి రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. ఆ ప్రయాణంలో రాజకీయ విజయాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి ప్రయత్నాలు, పాలనా అనుభవం, ప్రజలతో ఏర్పడిన అనుబంధం వంటి అనేక కోణాలు ఉన్నాయి.ఒక నాయకుడి నిజమైన గుర్తింపు పదవిలో కాదు ప్రజలకు అందించిన సేవలో ఉంటుంది.ఒక నాయకుడి గొప్పతనం మాటల్లో కాదు పనుల్లో కనిపిస్తుంది.ఒక నాయకుడి వారసత్వం పేరులో కాదు తరువాతి తరాలకు మిగిల్చిన అవకాశాల్లో ఉంటుంది.ఆందోల్ భవిష్యత్తు మరింత బలపడాలంటే వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, ఉపాధి, పరిశ్రమలు, మౌలిక వసతులు, సంక్షేమం ప్రతి రంగంలోనూ నిరంతర కృషి అవసరం.ప్రజల ఆశలను అభివృద్ధి లక్ష్యాలుగా మార్చి, అభివృద్ధి లక్ష్యాలను కార్యాచరణగా మార్చి,

# బాన్సువాడలో గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు..

**-200 మంది పోలీసులతో భద్రత..**

**-100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్లతో నిఘా**

**- డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు: ఎస్పీ రాజేష్ చంద్ర**

ప్రజాదివాస్

బాన్సువాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.నిమజ్జన శోభాయాత్ర కోసం బాన్సువాడ పట్టణాన్ని 3 సెక్టర్లుగా విభజించి, 10 పికెట్లు, 7 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. శోభాయాత్ర మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, నిమజ్జన ప్రాంతాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.శోభాయాత్రను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించేందుకు సుమారు 100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సీఐల పర్యవేక్షణలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచారు.గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.



మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు."భక్తి మనసులో ఉండాలి.. బాధ్యత మన చేతుల్లో ఉండాలి" అనే సందేశంతో ప్రజలు పోలీసు శాఖకు సహకరించి గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర విజ్ఞప్తి చేశారు.

# దామరంచలో హోరాహోరీగా గణపతి లడ్డూ వేలం రూ.85 వేలకు దక్కించుకున్న ప్రభంజన్‌రెడ్డి..

ప్రజాదివాస్



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దామరంచ గ్రామంలో గణపతి లడ్డూ వేలం పాటను హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.లడ్డూను దక్కించుకునేందుకు పలువురు పోటీపడటంతో వేలం పాట హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా సాగింది. చివరికి కమలాకర్‌రెడ్డి కుమారుడు ప్రభంజన్‌రెడ్డి అత్యధికంగా రూ. 85,000కు వేలం పాడి గణపతి లడ్డూను దక్కించుకున్నారు. దీంతో మండలి సభ్యులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.ఈ సందర్భంగా ప్రభంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనుమాన్ గణేష్ మండలి సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా పనిచేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

**- వర్క్ జోన్ సైన్ బోర్డులు లేకుండానే పనులు..**

ప్రజాదివాస్

మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో మెదక్--ఎల్కతుర్తి 765 జాతీయ రహదారి డివైడర్లపై పెరిగిన పిచ్చిమొక్కలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. వాస్తవానికి ఈ పనులను జాతీయ రహదారి అధికారులు తమ సిబ్బందితో చేపట్టాల్సి ఉండగా, పనులు ఆలస్యం కావడంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పంచాయతీ అధికారులు కార్మికులతో మొక్కలను తొలగిస్తున్నారు.అయితే కార్మికులు పనిచేస్తున్న ప్రాంతంలో ఎలాంటి బారికేడ్లు, హెచ్చరికలు లేదా వర్క్ జోన్ సైన్ బోర్డులు ఏర్పాటు



చేయకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. కార్మికుల పక్క నుంచే వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల భద్రత దృష్ట్యా పనులు జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సరితను వివరణ కోరగా.. జాతీయ రహదారి అధికారులు ప్రస్తుతం నందిగామ వరకు మాత్రమే పనులు చేపట్టారని, నిజాంపేట వరకు రావడానికి మరో 15--20 రోజులు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. వాహనదారులకు రహదారిపై పిచ్చిమొక్కల కారణంగా ఇబ్బంది ఏర్పడుతోందని కొందరు గ్రామస్థులు చెప్పడంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో మొక్కలను తొలగించే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతంలో ప్రమాదం ఉంటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

# గంగమ్మ ఒడిలో గణపయ్య తప్పులు మన్నించాలని గుంజీలు తీసిన షౌకత్‌పల్లి ప్రజలు..



ప్రజాదివాస్

మెదక్ జిల్లా నిజాంపేట మండలం షౌకత్‌పల్లి గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం శుక్రవారం వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను గ్రామస్థులు ఒక్కటై భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు.తప్పులు మన్నించాలని గుంజీలు.నిమజ్జన ఊరేగింపులో ప్రత్యేక భక్తి సన్నివేశం చోటుచేసుకుంది. నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో గానీ, పూజా కార్యక్రమాల్లో గానీ తమవైపు నుంచి ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే క్షమించాలని కోరుతూ గ్రామస్థులు లంబోదరుని ఎదుట గుంజీలు తీసి మొక్కులు చెల్లించారు. భక్తిపారవశ్యంతో గణనాథుడిని ప్రార్థిస్తూ, వచ్చే ఏడాది త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత, బాబు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తి వాతావరణం నెలకొంది

# 16 ఏళ్ల కల సాకారం హన్మాజీపేట్‌కు 24 గంటల విద్యుత్..

**-సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేక కృషి**

ప్రజాదివాస్

గ్రామ ప్రజలు 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నేటితో సాకారమైంది. హన్మాజీపేట్ గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేకంగా కృషి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి సర్పంచ్ చేసిన కృషి ఫలించింది. దీంతో గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా



అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎలక్ట్రికల్ డీఈ వినోద్ కుమార్, బాన్సువాడ రూరల్ ఏఈ అనిల్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు.16 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్ లావణ్య వెంకగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో విద్య, వ్యవసాయం, తాగునీటి సరఫరా తదితర రంగాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనాల సుభాష్, బోనాల సాయిలు, నాయకులు ప్రవీణ్ గౌడ్, భాను గౌడ్, రంగారి సంజీవ్, లైన్‌మెన్ రమేష్, వార్డు సభ్యులు వడ్ల భాగయ్య, పోతరాజ్ తుకారాం, గ్రామ పెద్దలు పోతరాజ్ లింగం, తలర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ జిల్లా స్థాయి సమన్వయ కమిటీకి వడ్ల శివరాం శ్రీను ఎంపిక..

ప్రజాదివాస్

సమాచార హక్కు చట్టం--2005 అమలులో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీకి బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన



ఆర్టీఐ కార్యకర్త వడ్ల శివరాం శ్రీను ఎంపికయ్యారు. ఆయన పేరును బాన్సువాడ ఆర్డీఓ రవీందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ రవీందర్‌రెడ్డి లేఖ నం. ఎఫ్/2093/2026 ద్వారా ప్రతిపాదన పంపారు. శివరాం శ్రీనుకు ఆర్టీఐ రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉందని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వడ్ల శివరాం శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలును సమన్వయ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఆర్టీఐ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పూర్తి స్థాయిలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్, మాజీ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి ఎం.ఎ. సలీంకు కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి సీతక్క సమీక్షా సమావేశం..

**- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి**

**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

ప్రజాదివాస్



ఈ నెల 28వ తేదీ సోమవారం కామారెడ్డి వేదికగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్వహించనున్న సమీక్షా సమావేశం ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అధికారులతో జరిగే ఈ సమావేశానికి వేదిక ఏర్పాట్లు, శాఖల వారీగా నివేదికల సిద్ధం, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, పెండింగ్ అంశాలు, సాధించిన లక్ష్యాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రి పర్యటన కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రూమ్ నంబర్ 25కు మార్చినట్లు అధికారులు తెలిపారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీఆర్ఓ పాండు, ఏఓ మసూద్ హైమద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వందేమాతరం గీతం..

-కామారెడ్డిలో ఘనంగా సామూహిక గేయాలాపన

ప్రజాదివాస్



వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 'నమామి భారతం-వందేమాతరం' కార్యక్రమాన్ని కామారెడ్డి పట్టణంలో శు క్రవారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్‌తో పాటు సర్దార్ పటేల్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, శివాజీ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయప్రకాశ్ నారాయణ విగ్రహం (జేపీఎన్), శ్రీ సరస్వతీ శిశు మందిర్ భగత్‌సింగ్ నగర్, కేజీబీవీ టేక్రియాల్, రెడ్డిపేట పాఠశాలల్లో ఉదయం 11 గంటలకు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు.
ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని, దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గీతం స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు.

# 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వందేమాతరం గీతం..

-కామారెడ్డిలో ఘనంగా సామూహిక గేయాలాపన

ప్రజాదివాస్




వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 'నమామి భారతం--వందేమాతరం' కార్యక్రమాన్ని కామారెడ్డి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్‌తో పాటు సర్దార్ పటేల్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, శివాజీ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయప్రకాశ్ నారాయణ విగ్రహం (జేపీఎన్), శ్రీ సరస్వతీ శిశు మందిర్ భగత్‌సింగ్ నగర్, కేజీబీవీ టేక్రియాల్, రెడ్డిపేట పాఠశాలల్లో ఉదయం 11 గంటలకు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్‌రావు మాట్లాడుతూ వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని, దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గీతం స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు..

ప్రజాదివాస్




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కామారెడ్డి 14వ వార్డు కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించేలా రాణించి, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.
పాఠశాలలోని 140 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, శైలజ, గీత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా గంగమ్మా.. నీ ఒడిలోకి వస్తున్నాను!

-ఒక గణపతి ఆత్మకథ

భక్తితో పిలిచారు... డీజేలతో భయపెట్టారు! కోట్ల ఖర్చు చేశారు... కానీ నా మాట విన్నారా?

ప్రజాదివాస్

"అమ్మా గంగమ్మా... వస్తున్నానమ్మా! నీ ఒడిలోకి వస్తున్నాను. నేను గణపతిని... విఘ్నాలను తొలగించేవాడిని. కానీ ఈసారి భూలోకంలో నేను చూసిన కొన్ని దృశ్యాలు నా మనసునే కలచివేశాయమ్మా!" ఏడాది తర్వాత మళ్లీ భూలోకానికి వచ్చాను. ప్రతి ఇంటా పూజలు... ప్రతి గల్లీలో మండపాలు... పిల్లల కేరింతలు... మహిళల హారతులు... భక్తుల ప్రార్థనలు. నన్ను ఎంత ప్రేమగా ఆహ్వానించారో చూసి ఆనందించాను. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ ఆ ఆనందం మధ్యలో నాకు మరో ప్రపంచం కనిపించిందమ్మా! డీజే నిశ్శబ్దపు మృత్యువు! "అమ్మా... నా ముందు భక్తితో నాట్యం చేయండి. ఆనందించండి. నాకు సంతోషమే. కానీ చెవులు దద్దరిల్లే డీజే శబ్దం ఎందుకమ్మా? ఆ శబ్దానికి చిన్నారులు ఉలిక్కిపడుతున్నారు. వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రోగులు తట్టుకోలేకపోతున్నారు. యువకులు గంటల తరబడి భారీ శబ్దం మధ్య నృత్యాలు చేస్తున్నారు. నా పేరు మీద జరిగే పండుగలో ఒక మనిషి ప్రాణానికైనా ముప్పు వస్తే... అది నాకు పూజ ఎలా అవుతుందమ్మా? నాకు డీజేలు వద్దని నేను ఎప్పుడూ చెప్పలేదు. ఆనందాన్ని వద్దనలేదు. కానీ ఆనందానికి హద్దు ఉండాలి. మీ సంబరం మరొకరి బాధ కాకూడదు!" భక్తితో ప్రారంభించి... విధ్వంసంతో ముగించొద్దు! ఒకప్పుడు వినాయక చవితి వస్తే ఇంటిల్లిపాది కలిసి మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించేవారు. పత్రి తెచ్చేవారు. ఉండ్రాళ్లు, కుడుములు చేసి నైవేద్యం పెట్టేవారు. పిల్లలకు కథలు చెప్పేవారు. ఇప్పుడు కొన్ని చోట్ల ఎవరి విగ్రహం పెద్దది? ఎవరి మండపం గొప్పది? ఎవరి డీజే ఎక్కువ శబ్దం చేస్తుంది? ఎవరు ఎక్కువ ఖర్చు చేశారు? అనే పోటీ పెరుగుతోంది. "అమ్మా... నా ఎత్తు పెరిగింది. మండపాల ఆర్భాటం పెరిగింది. ఖర్చు పెరిగింది. కానీ మనిషిలోని భక్తి కూడా అదే స్థాయిలో పెరిగిందా?" అని గణపతి ప్రశ్నిస్తున్నట్టుంది. లడ్డూ వేలం... లక్షల్లో! వినాయక ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా మారింది. బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం చిన్న మొత్తంతో మొదలై నేడు లక్షల రూపాయలకు చేరింది. 2026లో బాలాపూర్ లడ్డూ రూ.39 లక్షలకు వేలంలో దక్కినట్లు సమాచారం. "నా ప్రసాదానికి మీరు లక్షలు వెచ్చిస్తున్నారు... అది మీ విశ్వాసం. కానీ అదే భక్తిలో కొంత భాగం ఆకలితో ఉన్నవాడికి అన్నంగా, చదువుకోలేని చిన్నారికి పుస్తకంగా, వైద్యం అందని పేదవాడికి మందుగా మారితే... నేను మరింత ఆనందించనూ?" తిలక్ ఆశయం గుర్తుందా? "ఒకప్పుడు బాల గంగాధర్ తిలక్ నా పండుగను ప్రజలను ఒక్కచోట చేర్చే సామాజిక వేదికగా మలిచారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల్లో ఐక్యత, చైతన్యం పెంచేందుకు గణేష్ ఉత్సవాలను ఉపయోగించారు. మరి నేడు నా పండుగ మనుషులను కలపాలి గానీ... శబ్దం, పోటీ, ఆర్భాటంతో విడదీయకూడదు కదమ్మా!" అమ్మా... ఇక నీ ఒడిలోకి




వస్తున్నాను! వరకు నిమజ్జనానికి బయలుదేరాడు. డప్పుల చప్పుళ్లు... భక్తుల నృత్యాలు... "గణపతి బప్పా మోరియా" నినాదాలు... ఆ సందడిలో గణపతి మాత్రం మౌనంగా గంగమ్మతో మాట్లాడుతున్నట్టుంది. "అమ్మా గంగమ్మా... భూలోకంలో ఆనందాన్ని చూశాను. ఆర్భాటాన్నీ చూశాను. భక్తిని చూశాను... బాధను కూడా చూశాను. ఇక నీ ఒడిలోకి వస్తున్నాను. వచ్చే ఏడాది మళ్లీ వస్తాను. అప్పుడు నాకు ఇంకా ఎత్తైన విగ్రహం అవసరం లేదమ్మా... ఇంకా పెద్ద డీజే అవసరం లేదు... ఇంకా ఎక్కువ ఖర్చు అవసరం లేదు. ప్రకృతిని కాపాడండి. ప్రాణాలను కాపాడండి. పేదవాడి కన్నీరు తుడవండి. పక్క మనిషికి ఇబ్బంది కలిగించకుండా పండుగ చేసుకోండి.
అదే నాకు నిజమైన పూజ. భక్తికి శబ్దం కొలమానం కాదు అమ్మా... మనసే కొలమానం! ఇక సెలవమ్మా... నీ ఒడిలోకి

# వరంగల్ జిల్లా బాలుర జూనియర్ కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించిన డా.పుల్లూరి శ్రీనివాస్ గౌడ్

- వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డా.పుల్లూరి శ్రీనివాస్ గౌడ్

ప్రజాదివాస్

వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా సైనిక్ స్కూల్ అశోక్ నగర్ లో కొనసాగుతున్న జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ వరంగల్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి వరంగల్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని క్రీడాకారులు క్రమశిక్షణతో తమ నైపుణ్యాలను కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని, క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, కబడ్డీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వరంగల్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నుండి క్రీడాకారులను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమ ప్రత్యేక అతిధులు సైనిక్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనూష, సైనిక్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాయిల్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సైనిక్ స్కూల్లో కబడ్డీ




క్యాంపు నిర్వహించడం ఆనందదాయకమని, క్రీడాకారులు ప్రతిరోజు క్రమశిక్షణతో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారని రాష్ట్రస్థాయి పోటీలో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ముఖర్జీ ,సహాయ కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, నర్సంపేట స్టేడియం ఇన్చార్జి కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సైనిక్ స్కూల్ లెఫ్టినెంట్ కల్నల్ కిరణ్, సైనిక్ స్కూల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం మహేష్, తిరుపతి మరియు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు..

# ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు..

-నాలుగు ఎకరాల్లో 14 టన్నుల దిగుబడి సాధించిన రైతు

ప్రజాదివాస్





ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని గాంధారి మండలానికి చెందిన రైతు శానం భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో గెలల కోత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భాస్కర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు తన నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట నుంచి సుమారు 14 టన్నుల దిగుబడి పొందినట్లు తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగుకు తక్కువ శ్రమ, తక్కువ నీటి వినియోగం అవసరమవుతుందని, తద్వారా సాగు ఖర్చులు తగ్గి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఆయిల్‌పామ్ గెలలను సంబంధిత కంపెనీ కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ విషయంలో రైతులకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, మండల ఉద్యాన శాఖ అధికారి సుమన్, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ మేనేజర్ సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు రవీందర్, ప్రదీప్‌తో పాటు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# బాన్స్‌వాడలో గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు..

**-200 మంది పోలీసులతో భద్రత..**
**-100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్లతో నిఘా**
**- డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు: ఎస్పీ రాజేష్ చంద్ర**

ప్రజాదివాస్
బాన్స్‌వాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు. భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.నిమజ్జన శోభాయాత్ర కోసం బాన్స్‌వాడ పట్టణాన్ని 3 సెక్టర్లుగా విభజించి, 10 పికెట్లు, 7 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. శోభాయాత్ర మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, నిమజ్జన ప్రాంతాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.శోభాయాత్రను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించేందుకు సుమారు 100 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సీఐల పర్యవేక్షణలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచారు.గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.



మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు."భక్తి మనసులో ఉండాలి.. బాధ్యత మన చేతుల్లో ఉండాలి" అనే సందేశంతో ప్రజలు పోలీసు శాఖకు సహకరించి గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర విజ్ఞప్తి చేశారు.

## దామరంచలో హోరాహోరీగా గణపతి లడ్డూ వేలం రూ.85 వేలకు దక్కించుకున్న ప్రభంజన్‌రెడ్డి..

ప్రజాదివాస్



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దామరంచ గ్రామంలో గణపతి లడ్డూ వేలం పాటను హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.లడ్డూను దక్కించుకునేందుకు పలువురు పోటీపడటంతో వేలం పాట హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా సాగింది. చివరికి కమలాకర్‌రెడ్డి కుమారుడు ప్రభంజన్‌రెడ్డి అత్యధికంగా రూ. 85,000కు వేలం పాడి గణపతి లడ్డూను దక్కించుకున్నారు. దీంతో మండలి సభ్యులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.ఈ సందర్భంగా ప్రభంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనుమాన్ గణేష్ మండలి సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా పనిచేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

**- వర్క్ జోన్ సైన్ బోర్డులు లేకుండానే పనులు..**

ప్రజాదివాస్
మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో మెదక్--ఎల్కతుర్తి 765 జాతీయ రహదారి డివైడర్లపై పెరిగిన పిచ్చిమొక్కలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. వాస్తవానికి ఈ పనులను జాతీయ రహదారి అధికారులు తమ సిబ్బందితో చేపట్టాల్సి ఉండగా, పనులు ఆలస్యం కావడంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పంచాయతీ అధికారులు కార్మికులతో మొక్కలను తొలగిస్తున్నారు.అయితే కార్మికులు పనిచేస్తున్న ప్రాంతంలో ఎలాంటి బారికేడ్లు, హెచ్చరికలు లేదా వర్క్ జోన్ సైన్ బోర్డులు ఏర్పాటు



చేయకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. కార్మికుల పక్క నుంచే వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల భద్రత దృష్ట్యా పనులు జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సరితను వివరణ కోరగా.. జాతీయ రహదారి అధికారులు ప్రస్తుతం నందిగామ వరకు మాత్రమే పనులు చేపట్టారని, నిజాంపేట వరకు రావడానికి మరో 15--20 రోజులు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. వాహనదారులకు రహదారిపై పిచ్చిమొక్కల కారణంగా ఇబ్బంది ఏర్పడుతోందని కొందరు గ్రామస్థులు చెప్పడంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో మొక్కలను తొలగించే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతంలో ప్రమాదం ఉంటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.
7

## గంగమ్మ ఒడిలో గణపయ్య తప్పులు మన్నించాలని గుంజీలు తీసిన షౌకత్‌పల్లి ప్రజలు..



ప్రజాదివాస్
మెదక్ జిల్లా నిజాంపేట మండలం షౌకత్‌పల్లి గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం శుక్రవారం వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను గ్రామస్థులు ఒక్కటై భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు.తప్పులు మన్నించాలని గుంజీలు.నిమజ్జన ఊరేగింపులో ప్రత్యేక భక్తి సన్నివేశం చోటుచేసుకుంది. నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో గానీ, పూజా కార్యక్రమాల్లో గానీ తమవైపు నుంచి ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే క్షమించాలని కోరుతూ గ్రామస్థులు లంబోదరుని ఎదుట గుంజీలు తీసి మొక్కులు చెల్లించారు. భక్తిపారవశ్యంతో గణనాథుడిని ప్రార్థిస్తూ, వచ్చే ఏడాది త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత, బాబు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తి వాతావరణం నెలకొంది

# 16 ఏళ్ల కల సాకారం హన్మాజీపేట్‌కు 24 గంటల విద్యుత్..

**-సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేక కృషి**

సెప్టెంబర్ 25 ప్రజాదివాస్
గ్రామ ప్రజలు 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నేటితో సాకారమైంది. హన్మాజీపేట్ గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సర్పంచ్ లావణ్య వెంకగౌడ్ ప్రత్యేకంగా కృషి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ సమస్య పరిష్కారానికి సర్పంచ్ చేసిన కృషి ఫలించింది. దీంతో గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా



అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరపున ఎలక్ట్రికల్ డీఈ వినోద్ కుమార్, బాన్సువాడ రూరల్ ఏఈ అనిల్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. 16 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్ లావణ్య వెంకగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో విద్య, వ్యవసాయం, తాగునీటి సరఫరా తదితర రంగాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనాల సుభాష్, బోనాల సాయిలు, నాయకులు ప్రవీణ్ గౌడ్, భాను గౌడ్, రంగారి సంజీవ్, లైన్‌మెన్ రమేష్, వార్డు సభ్యులు వడ్ల భాగయ్య, పోతరాజ్ తుకారాం, గ్రామ పెద్దలు పోతరాజ్ లింగం, తలర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ జిల్లా స్థాయి సమన్వయ కమిటీకి వడ్ల శివరాం శ్రీను ఎంపిక..

ప్రజాదివాస్
సమాచార హక్కు చట్టం--2005 అమలులో భాగంగా కామారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీకి బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త వడ్ల శివరాం శ్రీను ఎంపికయ్యారు.



ఆయన పేరును బాన్సువాడ ఆర్డీఓ రవీందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ రవీందర్‌రెడ్డి లేఖ నం. ఎఫ్/2093/2026 ద్వారా ప్రతిపాదన పంపారు. శివరాం శ్రీనుకు ఆర్టీఐ రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉందని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వడ్ల శివరాం శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలును సమన్వయ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఆర్టీఐ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పూర్తి స్థాయిలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్, మాజీ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి ఎం.ఎ. సలీంకు కృతజ్ఞతలు తెలిపారు.
4

# మంత్రి సీతక్క సమీక్షా సమావేశం..

**- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి**
**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

ప్రజాదివాస్
ఈ నెల 28వ తేదీ సోమవారం కామారెడ్డి వేదికగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్వహించనున్న సమీక్షా సమావేశం ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అధికారులతో జరిగే ఈ సమావేశానికి వేదిక ఏర్పాట్లు, శాఖల వారీగా నివేదికల సిద్ధం, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, పెండింగ్ అంశాలు, సాధించిన లక్ష్యాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రి పర్యటన కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రూమ్ నంబర్ 25కు మార్చినట్లు అధికారులు తెలిపారు.సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీఆర్ఓ పాండు, ఏఓ మసూద్ హైమద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

